క్లుప్తంగా

అంగన్‌వాడీ పిలుస్తోంది


మానవహారంలో అంగన్‌వాడీ వలంటీర్లు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండల కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ అధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శేషగిరిరావు మాట్లాడుతూ మూడేళ్ల వయసున్న పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్చాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్లలో పోషకారం తోపాటు పీపీ1, పీపీ2గా పిల్లలను విభజించి పుస్తకాలు అందించడంతోపాటు ఆంగ్లంలో విద్య అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మునికృష్ణారెడ్డి, పీఆర్ ఏఈ నాగేంద్ర, సూపర్‌వైజర్ మనీలా, రోజారమణి పాల్గొన్నారు.

గర్భిణులు ప్రతినెలా వైద్య పరీక్షలు చేసుకోవాలి


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: మండలంలోని గర్భిణులు ప్రతినెలా వైద్య పరీక్షలు చేసుకోవాలని, తద్వారా బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. ఆయన సోమవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, బ్లడ్ గ్రూపింగ్, వీడీఆర్ఎల్, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ తదితర పరీక్షలు చేశారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతో పాటు మజ్జిగ, పండ్లరసం, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న వైద్యులు

గంగాధరనెల్లూరు: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు మండల రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో కేశవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పలు ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులు మధ్యాహ్నం ఇబ్బంది పడకుండా అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గురుప్రకాష్, శ్రీనివాసులు, రెడ్ క్రాస్ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

టీబీ లక్షణాలుంటే గళ్ల పరీక్ష చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కీర్తిప్రియ

నగరి: టీబీ లక్షణాలుంటే గళ్ల పరీక్ష చేసుకోవాలని మెడికల్ మొబైల్ యూనిట్ డాక్టర్ కీర్తిప్రియ అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎం.కొత్తూరులో టీబీపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఉంటే గళ్ల పరీక్షకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలన్నారు. టీబీ లక్షణాలు లేకున్నా దగ్గు వస్తుంటే నగరి హాస్పిటల్‌లో చెస్ట్ ఎక్స్‌రే తీసి పరీక్షలు చేసుకోవాలన్నారు. ఎంఎంయూ వాహనం వద్ద టీబీ లక్షణాలపై అవగాహన కల్పిస్తామన్నారు. సచివాలయం పరిధిలో టీబీ ఆన్ ట్రీట్మెంట్ కేసులు ఉంటే ఫుడ్ న్యూట్రిషన్ కిట్స్ అందించడానికి దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్షర విద్యార్థినికి ప్రతిభ అవార్డు


జిల్లా కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న విద్యార్థిని వనిత

నగరి: పట్టణ పరిధిలోని నాగలాపురం రోడ్డులో ఉన్న అక్షర పాఠశాలకు చెందిన విద్యార్థి కె.వనితకు షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డు దక్కింది. పదో తరగతి ఫలితాల్లో 600కి 566 మార్కులు సాధించినందుకు ఈ అవార్డును జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా అందుకుంది. ప్రతిభ చూపిన విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ లతాము రళి, ప్రిన్సిపల్ ముగిలన్ అభినందించారు.

రోడ్డుపై కూసాలు నాటేశారు

అధికారం అండతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రజల ప్రయోజనాలు పట్టడం లేదు. వెదురుకుప్పం మండలం గంటావారి పల్లె పంచాయతీ ఎగువ కనికాపురం గ్రామానికి వెళ్లే రోడ్డుపై దర్జాగా రాతి కూసాలు నాటారు. దీంతో నాలుగు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు.

- నాలుగు గ్రామాల కోసం ఏర్పాటు చేసిన రోడ్డు ఆక్రమణ
- ఇంత జరుగుతున్నా స్పందించని అటవీ, రెవిన్యూ శాఖ అధికారులు


రోడ్డుపై నాటిన రాతి కూసాలు

వెదురుకుప్పం: మండలంలోని జక్కిదొనలోని పెనుమూరు–పుత్తూరు ప్రధాన రహదారి నుంచి ఉప్పరపల్లె మీదుగా ఎగువ కనికాపురం, దిగువ కనికాపురం, ముతాలం గ్రామాలకు వెళ్లేందుకు గతంలో రోడ్డు సౌకర్యం ఉండేది కాదు. ఈ విషయాన్ని వైఎస్ఆర్ సీపీ నాయకుడు నారాయణరెడ్డి, స్థానికులు 2014లో ఎమ్మెల్యేగా ఉన్న కె.నారాయణ స్వామి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రోడ్డును ఏర్పాటు చేయాలని పాదయాత్ర చేశారు. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఏ మాత్రం స్పందించలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్య మంత్రిగా ఉన్న నారాయణస్వామి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. సుమారు 10 కిలోమీటర్ల మేర అటవీ, రెవెన్యూ భూములు ఉండడంతో ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి అనుమతులు తీసుకువచ్చారు. సర్వే నంబర్ 759లో 33 సెంట్లు, 319–2లో ఒక ఎకరా భూమిలో 10 మీటర్ల వెడల్పుతో 10 కిలోమీటర్ల మేర రోడ్డు ఏర్పాటు చేశారు. తారు రోడ్డు నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరు చేయించారు. ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి.

రోడ్డుకు అడ్డంగా రాతి కూసాలు

2024లో అధికారంలోకి కూటమి ప్రభుత్వం రావడంతో కూటమి నేతల అండతో రోడ్డుకు ఆనుకుని భూమి ఉన్న వ్యక్తి రోడ్డుపై రాతి కూసాలు నాటాడు. అటవీ భూమి నుంచి 10 మీటర్ల వెడల్పుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్కింగ్‌ను దాటి రోడ్డుపై వరుసగా నాటేశాడు. విషయం తెలియడంతో స్థానికులు వెళ్లి వారితో వాగ్వాదానికి దిగినా ఏమాత్రం పట్టించుకోలేదు. అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై రాతి కూసాలు నాటడంతో రోడ్డు కుచించుకుపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. అటవీ, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేసి ఏర్పాటు చేసిన రోడ్డు స్థలాన్నే ఫెన్సింగ్ వేసి ఆక్రమించుకుంటున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం దారుణమని చెబుతున్నారు. గంటావారిపల్లె సర్పంచ్ సైతం ఆక్రమణదారునకు వత్తాసు పలకడం భావ్యం కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ బాబుని వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


అధికారులు నాటిన సర్వే రాయిని దాటి ఆక్రమణ

రాజకీయ పలుకుబడితోనే....



గతంలో ఎన్నో పోరాటాలు చేసి రోడ్డును ఏర్పాటుచేసుకున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చాక రాజకీయ పలుకుబడితో రోడ్డుకు కేటాయించిన స్థలంలో రాతి కూసాలు నాటి ఆక్రమణకు పాల్పడడం సరి కాదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల కోసం పనిచేస్తున్నారో లేక అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారో అర్థం కావడం లేదు.
– తులసీరెడ్డి, కనికాపురం

అధికారులు పట్టించుకోవడం లేదు



రాతి కూసాలు నాటి రోడ్డును ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు లేకుంటే నాలుగు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోడ్డు కోసం స్థలంతో పాటు రూ.7 కోట్లు కేటాయించింది. ఇప్పుడు కూటమి నేతల అండతో అక్రమార్కులు ఇలా రోడ్డును ఆక్రమించుకోవడం తగదు. – రవీంద్ర రెడ్డి, స్థానికుడు

రాచపాళెం విద్యార్థులకు జాతీయ స్కాలర్‌షిప్


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

పుత్తూరు: పట్టణ పరిధిలోని రాచపాళెం ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు నిత్య, మోక్షిత, యుగంధర్‌లు నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మంగపతి తెలిపారు. ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు వారి చదువులకు అయ్యే ఖర్చును ఉపకార వేతనం కింద అందజేస్తారన్నారు. ఏటా రూ.12 వేలు వంతున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం మంగపతి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నరేంద్ర, సుబ్రమణ్యం ఆచారి, వేలు, రమేష్ అభినందించారు.

సీడీపీవో బాధ్యతల స్వీకరణ


పద్మసునంద

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు సీడీపీవో పద్మసునంద సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

సింహ వాహనంపై శ్రీవారు

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం యోగ నారాయణ స్వామి అలంకారంలో స్వామివారు సింహ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. ఉదయం 8 గంటలకు వాహనసేవ ప్రారంభమైంది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం 5 గంటలకు ఊంజల్ మండపంలోకి శ్రీవారు వేంచేపు చేశారు. అనంతరం సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ముత్యపు పందిరి వాహనంపై స్వామివారు భక్తులను ఆశీర్వదించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.


సింహ వాహనంపై శ్రీప్రసన్న వేంకటేశ్వరుడు

చైతన్యకు నాలుగు షైనింగ్ స్టార్ అవార్డులు


అవార్డులు అందుకున్న విద్యార్థులతో శరవణ, మోహన్

పుత్తూరు: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న షైనింగ్ స్టార్ అవార్డులు నాలుగింటిని స్థానిక శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. సోమవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చేతుల మీదుగా చైతన్య పాఠశాలకు చెందిన రితిక్ రోష్ని(596), కుషాల్‌వర్మ(594), హర్షిత(594), మేఘన(593) షైనింగ్ స్టార్ అవార్డులను అందుకున్నారు. పాఠశాల విద్యా బోధన ప్రమాణాలకు అద్దంపట్టేలా అవార్డులు సాధించిన విద్యార్థులను పాఠశాల ఏజీఎం సురేష్, హెచ్‌ఎం శరవణ, కో–ఆర్డినేటర్ బాలాజీ, డీన్ మోహన్, రూపవాణి అభినందించారు.

షైనింగ్ స్టార్స్ అవార్డులను అందుకున్న విద్యార్థులు

పాలసముద్రం: మండలంలోని తిరుమళరాజుపురం హైస్కూల్ విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నట్టు ఎంఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తిరుమళరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎల్.అభినయ, జే పావణి, కే శరణ్య అత్యధిక మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికై నట్టు తెలిపారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.20 వేలు, జ్ఞాపిక అందుకున్నారని వెల్లడించారు.


షైనింగ్ స్టార్స్ అవార్డు అందుకుంటున్న విద్యార్థినులు

ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రమ్య

పుత్తూరు: ఉద్యోగ విరమణ పొందిన వృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అమరరాజా హాస్పిటల్స్ డాక్టర్ రమ్య సూచించారు. సోమవారం పుత్తూరు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సర్వసభ్య సమావేశం సంఘ అధ్యక్షుడు జి.గుణశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమ్య మాట్లాడుతూ వృద్ధాప్యంలోని వారు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలను తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. మితాహారం, క్రమం తప్పని వ్యాయామం చేయాలని చెప్పారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సభ్యులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులు జయరామరాజు గురువులైన మునిరత్నంనాయుడు, అండాళమ్మ గౌరవార్థం భవన నిర్మాణానికి రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. హనుమంతరావు భోజన వసతి కల్పించారు. యుగంధర్‌రాజు, రవిశంకర్, రమేష్, వెంకటకృష్ణమనాయుడు, రామచంద్రరాజు, కుప్పయ్య, కృపావరమ్మ, అరుణాచలం, భాస్కర్‌రెడ్డి, వెంకట్రామయ్య, సుబ్రమణ్యం, మనోహర్, లోకేశ్వరి, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో పెరుగుతున్న అత్యాచారాలు


ద్రాక్షాయణి

పెనుమూరు(కార్వేటినగరం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని వైఎస్ఆర్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ద్రాక్షాయణి ఆరోపించారు. ఆమె సోమవారం పెనుమూరులో విలేకరులతో మాట్లాడారు. మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నట్టు ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా అంగీకరించిందన్నారు. అయినా ఎక్కడా తగిన చర్యలు తీసుకోలేదన్నారు. హోమ్ మంత్రి అనిత ఒక మహిళ అయినప్పటికీ ఒక్క బాధితురాలిని కూడా పరామర్శించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దూషించడమే ధ్యేయంగా ప్రెస్‌మీట్లు పెడుతున్నారని, రాష్ట్రంలోని మహిళ భద్రతను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇటీవల సాక్షి డిబేట్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు అమరావతిపై చేసిన వ్యాఖ్యలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతి, సాక్షి మీడియాకు ఆపాదించి రాజకీయ లబ్ధి పొందాలని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్ భారతికి సంబంధం లేని అంశాన్ని పట్టుకుని ఆమె క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎల్లో మీడియాలో నిత్యం ఎన్నో అనుచిత వ్యాఖ్యలు చేయించిన ఆ జర్నలిస్టులు, ఎల్లో నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని నిలదీశారు. నారా లోకేష్ నడిపిస్తున్న సోషల్ మీడియాలో మహిళలను ఎలా ట్రోల్ చేస్తున్నారో అందరికీ తెలుసన్నారు. వారితో కూడా క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు.

సుస్థిర వ్యవసాయం లాభదాయకం

పెనుమూరు(కార్వేటినగరం): సుస్థిర వ్యవసాయ విధానాలు పాటించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని అధిక ఆదాయం పొందవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ దివ్య తెలిపారు. మండలంలోని శాతంబాకం, దాసరిపల్లిలో సోమవారం వికసిత్ కృషి విజ్ఞాన అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజన్‌లో నూతన వంగడాలు కొనుగోలు చేయాలన్నారు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు. డ్రోన్ ద్వారా పురుగుల మందు పిచికారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భారతీయ పరిశోధనా మండలి శాస్త్రవేత డాక్టర్ మంజునాథ్, శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత డాక్టర్ దివ్య

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పాలసముద్రం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీవో క్రిష్ణమహేష్‌రెడ్డి తెలిపారు. ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం డ్వాక్రా మహిళలకు యోగాపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేసి మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ చేశారు. పోలీసు స్టేషన్ ఆవరణలో మానవహారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, సంఘమిత్ర మురగయ్య, శోభ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీవో పురుషోత్తం తెలిపారు. వెదురుకుప్పంలో సోమవారం యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడిని దూరం అవుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబు, ఏపీఎం పరశురామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: యోగాతో శారీరక, మానసిక ఒత్తిళ్లను నియంత్రించ వచ్చని ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. యోగాంధ్రలో భాగంగా సోమవారం ఎంపీడీవో ఆధ్వర్యంలో సచివాలయం, వెలుగు, ఉపాధి హామీ సిబ్బంది ఎంపీడీవో కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాండ్లమిట్ట కూడలిలో మానవ హారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో విజయకుమార్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నాగరత్నమ్మ, ఏవో హేమలత తదితరులు పాల్గొన్నారు.


యోగాపై మానవహారం


శ్రీరంగరాజపురంలో యోగాపై అవగాహన ర్యాలీ

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో సోమవారం ఎంపీడీఓ మోహన్‌మురళీ ఆధ్వర్యంలో యోగాంధ్రపై ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి పుల్లూరు క్రాస్ వరకు సాగింది.


వెదురుకుప్పంలో ర్యాలీ చేస్తున్న అధికారులు

ఫిట్ లేకుంటే.. స్టాప్

ఆర్టీఏ నిబంధనల ప్రకారం ప్రతి స్కూల్, కాలేజ్ బస్సుకు ఫిట్‌నెస్ టెస్టు తప్పనిసరి. ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకొని సర్టిఫికెట్ పొందిన వాహనాలే విద్యార్థులను తీసుకెళ్లాలి. ఈ నెల 12 నుంచి పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కానుండడం, విద్యార్థులను తరలించే పలు ప్రాంతాల్లో పాఠశాల బస్సుల కండిషన్‌పై విమర్శలు వస్తున్న నేపథ్యంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ అధికారులు దృష్టిసారించారు. బస్సుల ఫిట్‌నెస్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. – నగరి

- స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి
- ఆర్టీఓ కార్యాలయ పరిధిలో మొత్తం 25 స్కూల్ బస్సులు
- ఇప్పటికే ఫిట్‌నెస్ పూర్తి చేసుకున్న బస్సులు 12
- ఫిట్‌నెస్ టెస్ట్ చేయించుకోవడానికి గడువు జూన్ 15
- సర్టిఫికెట్ లేకుండా రోడ్డెక్కితే సీజ్

నగరి ఆర్టీఓ పరిధిలో 25 స్కూల్, కాలేజీ బస్సులు ఉండగా ఇప్పటివరకూ 12 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ టెస్ట్ చేసుకొని సర్టిఫికెట్లు పొందాయి. మిగిలిన బస్సులు కూడా ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకుని, సర్టిఫికెట్ పొందాల్సి ఉంది. జూన్ 12 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో ఆయా విద్యా సంస్థల నిర్వాహకులు, వాహనాల యజమానులకు రవాణా శాఖ అధికారులు సమాచారం అందించారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు రోడ్డెక్కితే వాటిని సీజ్ చేయడంతోపాటు యజమానులపై కేసులు నమోదు చేస్తామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి హెచ్చరించారు. జూన్ 15లోగా తప్పనిసరిగా ప్రతి వాహనానికి ఫిట్‌నెస్ పరీక్ష చేయించాల్సిందేనని స్పష్టం చేశారు.


బస్సు కండిషన్ పరీక్షిస్తున్న ఆర్టీఓ

బస్సుల ఫిట్‌నెస్ ఇలా..

ముందుగా ఫిట్‌నెస్ కోసం వచ్చిన స్కూల్ బస్సులను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. టైర్ల కండిషన్, పిల్లలు ఎక్కే మెట్లు, గ్రిల్స్, సీట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ కిట్, వైపర్స్, ఇండికేటర్స్, హెడ్ లైట్స్, గ్లాస్, రూఫ్, బస్ కండిషన్ ఇవన్నీ సరిగ్గా ఉన్నాయా లేదా అని అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఏదైనా లోపాలు గుర్తిస్తే అవి మరమ్మతులు చేసుకున్నాకే ఆ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

ఎఫ్‌సీ లేకుంటే కఠిన చర్యలు



ప్రతి స్కూల్, కాలేజీ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి. అందరూ వచ్చి పరీక్షించుకొని సర్టిఫికెట్ పొందాలి. సర్టిఫికెట్ లేకుండా బస్సులు విద్యార్థులను తీసుకెళితే వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో పాటు ఆ పాఠశాలల యాజమాన్యంపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇచ్చిన గడువులోపు సర్టిఫికెట్ పొందాలి.
–వాసుదేవరెడ్డి, ఆర్టీఓ, నగరి